తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# కాళంగి గ్రాయను పరిశీలించిన జలవనరుల శాఖ అధికారులు



తడ, నవంబర్ 9 ప్రభాతవార్త : తడ మండలంలో రైతులకు ప్రధాన సమస్యగా ఉన్న కాళంగి గ్రాయనును బుధవారం సూళ్లూరుపేట జలవనరుల శాఖ అధికారులు పరిశీలించారు. మంగళవారం తడ మండల సర్వసభ్య సమావేశంలో గ్రాయను సమస్యను పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తడంతో అధికారులు స్పందించారు. ప్రస్తుతం చేనిగుంట, వాటంబేడు గ్రామాల మధ్య రహదారి సౌకర్యం సక్రమంగా లేనప్పటికీ అధికారులు శ్రమకోర్చి ఆ ప్రాంతానికి వెళ్లారు. అయితే గతంలో 40 మీటర్ల మేర కోతకు గురైన గ్రాయను ప్రాంతం ఇటీవలి వర్షాలకు రెట్టింపుగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కారణంచేత పులికాట్ సరస్సులోని ఉప్పునీళ్లు కాళంగి నదిలోని మంచి నీళ్లతో కలిసిపోవడంతో నది మొత్తం ఉప్పుగా మారిపోయిందని రైతుల ద్వారా తెలుసుకున్నారు. ఆ సమీపంలో పంట పొలాలకు ఉప్పు ముప్పు తప్పదని, సీజన్‌కు ముందే పనులు జరిపి ఉంటే బావుండేదని రైతులు అంటున్నారు. అయితే ఇప్పటికి నాలుగు సార్లు టెండర్లు వేసి పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులు అంటున్నారు. తాజాగా రూ.12.50 కోట్లతో మరోసారి ఈ గ్రాయను నిర్మాణానికి అంచనాలు వేశామని, రెండు వారాల్లోనే టెండర్లు పిలవవచ్చని చెప్తున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని సూళ్లూరుపేట జలవనరుల శాఖ డీఈ శ్రీధర్ తెలిపారు. ఆయనతో పాటు ఏఈలు ఠాగూర్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు. అనంతరం అధికారులు తడ మండల కార్యాలయంలో ఎంపీపీ కొళవి రఘుతో సమావేశమై జలవనరుల శాఖ సమస్యల గురించి చర్చించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ మురళీకృష్ణ వైసీపీ నాయకులు ఎం.నరేష్‌రెడ్డి తదితరులు చర్చించారు.

# అధికారులు...బాధ్యతాయుతంగా పనిచేయాలి

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గంగవరం, నవంబరు 9, ప్రభాతవార్త : అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం చూపరాదని,ప్రతి ఒక్క అధికారి బాధ్యతా యుతంగా పని చేయాలని, ఎవరైనా అలసత్వం చూపితే చర్యలు తప్పదని జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ పేర్కొన్నారు. బుధ వారం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన చేశారు.పర్యటనలో భాగంగా పసుపత్తూరు, పత్తికొండ, కీలపట్ల, పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. ఈ నేపథ్యంలో పత్తికొండ, పసుపత్తూరు, గోవిందశెట్టిపల్లె గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, మరింత రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు.పత్తికొండ ప్రాథమిక పాఠశాల రికార్డులను తనిఖీ చేయగా అక్కడ ఎస్జీటిగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఎలాంటి అనుమతి లేకుండా గత నెల రోజులుగా విధులకు హాజకాలేదని దీంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉపాధ్యాయుడు గతంలో శాంతిపురంలో పని చేస్తున్నప్పుడు కూడా ఓ సారి సస్పెండ్ అయినట్లు తెలిసింది.జగనన్న విద్యా కానుక కిట్‌లు అందరికీ అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ హైస్కూల్‌ల్లో రెండో విడత నాడు నేడు పనుల కోసం రూ.42 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 10 కంపోనెంట్ల పనులను నాణ్యతతో త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ద్వారా గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలను గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కీలపట్ల నందు జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించి అందుకు సంబంధించిన రైతులకు రైతులకు అవగాహన కల్పించి పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ట్రైనీ కలెక్టర్ మేఘాస్వరూప్ మండల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యశాఖకు... చికిత్స చేసేదేవరు!

## - జిల్లాల విభజనతో ఖాళీ ఏర్పడిన డిఎంహెచ్ఓ పోస్టు - క్షేత్ర స్థాయిలో వైద్యం అధ్వాన్నం



చిత్తూరు, నవంబర్ 9 ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రాధాన్యత రంగాల్లో విద్య, వైద్యం కీలకమైనది. ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యశాఖలో ఇప్పటికే అమలు అవుతున్న పథకాలతో పాటు ప్రభుత్వం కొత్తగా 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలులోకి కావడంతో ప్రతి రోజు ఒక డాక్టర్ ఒక గ్రామంకు వెళ్ళి అక్కడి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన మందులు పంపిణీ చేసి వస్తున్నారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కీలకమైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పోస్టును మాత్రం ప్రభుత్వం ఇప్పటికీ భర్తీ చేయని పరిస్థితి నెలకొంది. జిల్లాల పునర్విభజన జరుగకముందు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ శ్రీహరి బాధ్యతలు నిర్వర్తించేవారు. జిల్లాల పునర్విభజన జరుగడంతో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ప్రభుత్వం అప్పటి నుండి చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఎవరిని నియమించకపోవడంతో తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ప్రస్తుతం చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జీ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ నరసింహారెడ్డిని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమించినప్పటికీ ఆయన ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. ఫలితంగా చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనాధగా మారింది. జిల్లాల పునర్విభజన జరుగడంతో పాత జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న జిల్లా స్థాయి అధికారులను ప్రభుత్వం అదే జిల్లాల్లో కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరిని మాత్రం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ మేరకు ఆయన అక్కడికి వెళ్ళి డిఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించారు. అయితే చిత్తూరు జిల్లాకు కొత్తగా ఎవరిని డిఎంహెచ్ఓగా నియమించకపోవడంతో ప్రభుత్వం నూతన డిఎంహెచ్ఓ బాధ్యతలు స్వీకరించే వరకు ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓగా కొనసాగాలని తిరుపతి జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరిని నియమించింది. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎంతో అవసరం వుంటుంది. ఈ మేరకు ప్రభుత్వం చిత్తూరు జిల్లాకు నూతన డిఎంహెచ్ఓను వీలైనంత త్వరగా నియమించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# న్యాయ, ప్రభుత్వ సేవలు ప్రజలకు అందజేయడమే లక్ష్యం : జిల్లా జడ్జి





న్యాయసేవా దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావ్

చిత్తూరు, నవంబర్ 9 ప్రభాతవార్త: న్యాయ సేవలతో పాటు ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు అందించడమే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమని జిల్లా జడ్జి ఇ.భీమారావ్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్, అదనపు జిల్లా జడ్జి శాంతి, అదనపు జడ్జి శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డిలతో కలసి న్యాయ సేవా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఇ.భీమారావ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం న్యాయ వ్యవస్థ పని చేస్తోందన్నారు. సామాజిక అభివృద్ధికి సంబంధించిన చట్టాలు, సమాజ అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న అనేక కార్యక్రమాలను గ్రామ స్థాయి ప్రజల వద్దకు తీసుకువెళ్ళడమే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా నవంబర్ 13వ తేదీ వరకు హక్కు హమారాబీ హై అనే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు న్యాయ వ్యవస్థ నాలుగు గోడల మధ్య వుండేదని, ఈనాడు న్యాయ వ్యవస్థ ప్రజల మధ్య ప్రజల కోసం పని చేస్తోందన్నారు. ప్రస్తుతం న్యాయ సేవా దినోత్సవంను ఘనంగా జరుపుకొని క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం న్యాయ న్యాయ వ్యవస్థ పని చేస్తోందన్నారు. జిల్లాలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో వున్న వివిధ రకాల 19 వేల పెండింగ్ కేసులకు న్యాయ సేవాధికార సంస్థ పరిష్కరించిందన్నారు. అలాగే చట్ట వ్యతికేక కార్యక్రమాలకు పాల్పడి జైళ్ళలో వున్న ఖైదీలకు హక్కులు లేవని చెప్పడం సరికాదన్నారు. జైలులో వున్న ఖైదీలకు వున్న హక్కులను అందించడం కోసం హక్కు హమారాబీ హై అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆనందరెడ్డి, విద్యార్థులు, జైలు వార్డెన్లు, ఖైదీలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 20 నుండి... అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు



తిరుచానూరు,నవంబర్ 9 ప్రభాతవార్త: తిరుచా నూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుండి 28వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఇందు కోసం 19వ తేదీ అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 15వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. బ్రహ్మోత్సవాలలో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, అలాగే రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరగనున్నాయి.కోవిడ్ కారణంగా రెండేళ్ల తరువాత ఆలయ మాడవీధుల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**వాహన సేవల వివరాలు :**

20వ తేదీ ఆదివారం ఉదయం ధ్వజారోహణం,రాత్రి చిన్నశేషవాహనం,21 సోమవారం ఉదయం పెద్దశేషవాహనం,రాత్రి హంసవాహనం,22 మంగళవారం ఉదయం ముత్యపుపందిరి వాహనం,రాత్రి సింహవాహనం, 23 బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనం,రాత్రి హనుమంతవాహనం,24 గురు వారం ఉదయం పల్లకీ ఉత్సవం,రాత్రి గజవాహనం,25 శుక్రవారం ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి స్వర్ణరథం,గరుడవాహనం,26 శనివారం ఉదయం సూర్యప్రభ వాహనం,రాత్రి చంద్రప్రభ వాహనం,27 ఆదివారం రథోత్సవం,రాత్రి అశ్వవాహనం,28వ తేదీ సోమవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగే పంచమితీర్థం,రాత్రి ధ్వజారోహనంతో బ్రహ్మోత్సవాల ఘట్టం ముగుస్తుంది.

# 10 టన్నుల తమిళ రేషన్ బియ్యం పట్టివేత





తడ/సూళ్ళూరుపేట, నవంబర్ 9 ప్రభాతవార్త: సూళ్లూరుపేట రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ పోలీసులు చెన్నై నుండి వచ్చే నుండి వచ్చే రైళ్ళలో జరిపిన తనిఖీలలో సుమారు 2.5లక్షల విలువ చేసే 10 టన్నుల తమిళనాడు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇందులో 252 బస్తాలు రేషన్ బియ్యంను నాయుడుపేట, సూళ్ళూరుపేట రైల్వే స్టేషన్ పరిధిలో పట్టుకోగా, మరో కొన్ని బస్తాలను తడ రైల్వే స్టేషనల్లో పట్టుకున్నట్లు ఆర్‌పిఎఫ్ పోలీసులు తెలిపారు. ఇకపై చెన్నై నుండి వచ్చే రైళులో తరచూ తనిఖీలు ఉంటాయని ఎవరైనా అక్రమంగా తమిళనాడు రేషన్ బియ్యం తరలిస్తే వారిపైన కఠినమైన చర్యలు ఉంటాయని ఆర్‌పిఎఫ్ పోలీసులు హెచ్చరించారు. సీనియర్ డిఎస్‌సి సెంధిల్ కుమారేనన్ మరియు ఎఎస్‌సి సౌరకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పట్టుక్ను తమిళనాడు రేషన్ బియ్యాన్ని తమిళనాడు పరిధిలోని గుమ్మిడిపూండి రెవెన్యూ అధికారులుకు అప్పగించడం జరిగిందన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పథకాలు

**- డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ**



చిత్తూరు, నవంబర్ 9 ప్రభాతవార్త: మహిళలు ఆర్థికంగా ముందడుగు వేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టిందని ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ పేర్కొన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడానికి పలు సంస్థలు ముందుకు వస్తున్నాయని ఈ సంస్థలను ఉపయోగించుకొని మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని ఆమె కోరారు. సౌరశక్తితో పని చేసే పలు పరికరాలను ఉపయోగించుకొని జీవనోపాధి, ఆలంబన చేసుకోవడానికి ఒక ప్రైవేటు సంస్థ డిఆర్‌డిఎ సంఘ సభ్యులకుబుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సౌరశక్తి ఉపయోగించుకొని తక్కువ ఖర్చుతో పలు యంత్రాలను ఉపయోగించి ఆర్థికంగా ఎదగవచ్చునని మహిళలకు తెలిపారు. పాలు పితికే యంత్రం, కుట్టు పని యంత్రం, రోటీ తయారు చేసే యంత్రం, పిండి తయారీ యంత్రం, ఫోటోకాఫీ తయారు చేసే యంత్రం, పిండిమిల్లు యంత్రం, సౌరశక్తితో నీటి వ్యవస్థ, హైడ్రోఫోరెన్సిక్, సౌరశక్తితో పంటలకు స్ప్రే చేసే యంత్రాలను మహిళలకు సంస్థ ప్రతినిధులు డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి యంత్రాలు అవసరమని, తక్కువ ఖర్చుతో ఎక్కువ పని చేసే యంత్రాలను అమర్చుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ విషయంపై మొదట జిల్లా స్థాయిలో మహిళా సంఘాలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆపై క్షేత్ర స్థాయిలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలు అమలు చేస్తోంని రానున్న కాలంలో మరిన్ని సంస్థలు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ముందుకు వస్తాయన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లాలోని ఎపిఎంఓలు, ఇతర సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మొన్న తొలగించారు... నేడు మళ్ళీ రాళ్ళు నాటారు!



తొట్టంబేడు, నవంబర్ 9 ప్రభాతవార్త : తొట్టంబేడులో రియల్ వ్యాపారులు, ఆక్రమణ దారులు కలసి వ్యాపారాలు చేస్తున్నారు. కోట్లు విలువచేసే స్థలంను కాపాడడంలో తొట్టంబేడు తహశీల్దార్ సుధీర్‌రెడ్డి ఎంత ప్రయత్నిస్తున్నా కబ్జాదారులు రాత్రిరాత్రే మళ్ళీ ఆస్థలంలో రాళ్ళను నాటి వారు కూడా తమ సత్తాను చాటుతున్నారు. ఈనేపథ్యంలో గత గురువారం కోట్లు విలువచేసే భూమిలో కొందరు కబ్జాదారులు, రియల్‌వ్యాపారులతో కుమ్మక్కై వెంచర్లు వేయడంతో స్పందించిన ఆయన వాటిని తొలగింపు చేపట్టారు. దీనిపై కన్నుపడ్డ కబ్జారాయుళ్ళు ఒక్కొక్క ప్లాటు ధరను లక్షల్లో అమ్మాలని నిర్ణయించుకున్నారు. మండలకేంద్రానికి సమీపంలో చెన్నై-నాయుడుపేట బైపాస్‌రోడ్డు సమీపంలో కల్లాంమిట్ట సర్వే నంబర్ 10/1లో 0.23సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఇది సుమారు రూ.కోటిపైగా ధర ఉంటుందని అంచనా. దీనిలో కొందరు వెంచర్లు వేయడంతో విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంటనే విఆర్‌ఓ చిట్టిబాబుతో కలసి ఆక్రమణల్లో ఉన్న భూముల్లో వేసిన సర్వేరాళ్ళను తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎవ్వరైనా ఆక్రమణలు చేపడితే సహించేది లేదని వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. అయితే తిరిగి ఈస్థలంలో కొందరు కబ్జారాయుళ్ళు, రియల్ వ్యాపారులతో కలసి మళ్ళీ సరిహద్దురాళ్ళను నాటివేయడం గమనార్హం. దీనిపై తొట్టంబేడు తహశీల్దార్ ఏం చర్యలుతీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

# ఐదు మంది విద్యార్థులు మిస్సింగ్



తిరుపతి క్రైం, నవంబర్ 9 ప్రభాతవార్త : తిరుపతిలోని అన్నమయ్య పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులతో పాటు 9వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి అదృశ్యమై య్యారు. వెస్ట్ సిఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు మేరకు.. తిరుపతి ఐఎస్ మహాల్ వద్ద అన్నమయ్య పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మోహిత్, గుణశ్రీ, భవనశ్రీ, అబ్దుల్ రహమన్, 9వ తరగతి చదువుతున్న ఆతిఫ్ హుస్సేన్‌లు బుధవారం ఉదయం పాఠశాలలో ప్రత్యేక తరగతులకు ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్ళారు. 8 గంటలకు ప్రత్యేక తరగతులు ముగించుకుని పాఠశాల నుంచి ఇంటి బయలుదేరారు. ఇంటికి బయలు దేరిన విద్యార్థులు సమయం గడుస్తున్నా రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్ళి విచారించారు. పిల్లలు ఐదు మంది కనిపించక పోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు సిసి టీవీ ఫుటేజ్ ఆధారంగా వెతుకుతున్నారు. పిల్లల ఆచూకి తెలిసిన వారు 8099999977 పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

# ఎస్ఎస్ కెనాల్‌కు మోక్షం...ముచ్చివోలు రోడ్డుకు మహార్ధశ

**-ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి**

శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రితో బేటీ అయిన ఎంఎల్ఏ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని ఎస్ఎస్ కెనాల్ నుంచి రైతులకు నీరందించే అంశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా అనుకూలంగా స్పందించారని వెంటనే ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. ఎంతోకాలంగా ఎస్ఎస్ కెనాల్ పనులు వివిధ కారణాలతో ఆగాయన్నారు. ఈ కాలువ పూర్తిచేసి ఏడు చెరువులకు నీటిని విడుదల చేస్తే అన్నదాతలు రెండోపంట లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని ఎంఎల్ఏ వివరించారు. ప్రస్తుతం రుతుపవనాల వల్ల వర్షాలు ఆగమ్యగోచరంగా మారడంతో ఎస్ఎస్ కెనాల్ పూర్తి అయితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించగా ముఖ్యమంత్రి అనుకూలంగా స్పందించారన్నారు. ఎస్ఎస్ కెనాల్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి దివంగత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అన్నదాతలకు అందించిన వరమని రైతులకు అండగా భరోసాగా నిలవడమే వైఎస్ కుటుంబం లక్ష్యమని వివరించారు. కాగా శ్రీకాళహస్తి వయా ముచ్చివోలు, పల్లంరోడ్డు విస్తరణ 20సంవత్సరాలుగా ఆచరణకు నోచుకోలేదని ఈరోడ్డుకు మోక్షం కల్పించారని తెలిపారు. కాగా ఈ మార్గంలో ప్రస్తుతం సుమారు ఏడువేల జగనన్న ఇండ్లు భారీ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు.

**స్కిట్ కళాశాలపై చర్చ :**



తెలుగుదేశం హయాంలో ఖాయిలా పడి మూత పడ్డ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల సమస్యకు సంబంంచి ముఖ్యమంత్రితో చర్చించామని దానిని తెరిపించుటకు అవసరమైన చర్యలు నివేదికలు తెప్పించుకుని నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్లు ఎంఎల్ఏ మధుసూధన్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించి గడపగడపకు నిర్వహిస్తున్న పాదయాత్రలో జనం నుంచి వస్తున్న స్పందనను ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబందించిన అభివృద్ధి పనులపై సిఎం సంతృప్తి వ్యక్తం చేసినట్లు వివరించారు. ధార్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చి భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని సూచించినట్లు తెలిపారు.

# పెచ్చులూడుతున్నా పట్టించుకోరా...!




**సత్యవేడు,నవంబర్ 9 ప్రభావార్త :**
మండలపరిధిలోని కాళమనాయుడుపేట, మల్లవారిపాలెం వెస్ట్ అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరింది. చినుకుపడ్డ, మెరుపులు మెరిసినాభవనాల పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడుతు న్నాయని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు.
కాళమ నాయు డుపేటలో పరిస్థితి అధ్వానంగా ఉంది. చినుకులు పడితే అంగన్‌వాడీకేంద్ర నిర్వహణ భయాందోళనలో సాగించాల్సి న పరిస్థితి నెలకొందని అక్క డవాసులు వాపోతు న్నారు. పిల్లలకు ఇచ్చే ఆహార పదార్థాలు కూడా నిల్వచేసుకోవడంఇబ్బంది కరంగా మారిందని నిర్వాహకులు తెలిపారు.దుస్థితి విష యంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేక పోయిందని కాళమ నాయుడుపేట గ్రామస్థులు వాపో తున్నారు. ఇక మల్లవారిపాలెం వెస్ట్‌లో సిమెంట్ రేకులు వేసిన షెడ్ లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. షెడ్‌పై కప్పు అధ్వానంగా మారడంతో పరిసరాలపూర్తిగా తడిసి ముద్దవు తున్నాయి. ఇక్కడ కేంద్ర నిర్వహణ కూడా వర్షాకాలంలో సమస్యగా మారింది. ఈరెండు కేంద్రాలను పూర్తిస్థాయిలోమరమ్మతులుచేయాలనిఆయాగ్రామస్థులు కోరుతున్నారు

## కులవృత్తుల్లో కార్పొరేట్ పెట్టుబడులను ప్రభుత్వం అడ్డుకోవాలి

**కుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త :**



కులవృత్తుల్లో కార్పొరేట్ సంస్థల పెట్టుబడులను ప్రభుత్వాలు అడ్డుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు వైద్యం శాంతారాం డిమాండ్ చేశారు. నాయీ బ్రాహ్మణులు కుల,మతాలకు అతీతంగా తరతరాలుగా కులవృత్తిని చేస్తూ జీవనోపాధి పొందుతునా న్నరన్నారు. అలాంటి తమ వృత్తిలో రిలయన్స్ లాంటి సంస్థలు ప్రవేశించి షాపులు ఏర్పాటు చేస్తున్నారని వాటిని అడ్డుకుంటామని హెచ్చరించారు. రోజంతా కష్టపడితే వచ్చే కొంత ఆదాయంతో కుటుంబాలు పోషించుకోవడం కష్టంగా ఉన్న సమయంలో రిలయన్స్ వంటి సంస్థలు తమ వృత్తిలో ప్రవేశించకుండా ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులు తమ విధానాలు మార్చుకోవాలన్నారు.

## చేపల మార్కెట్ తరలింపుకు చర్యలు

**కుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త :**



కుప్పం పట్టణంలో రోడ్ల పక్కనే నిర్వహిస్తున్న చేపల దుకాణాలను కొత్తపేటలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్ స ప్రాంతంలో మార్చేందుకు మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కమీషనర్ రవిరెడ్డి చర్యలు చేపట్టారు. పట్టణంలో నేతాజీ రోడ్, కృష్ణగిరి సర్కిల్ తదితర ప్రాంతాల్లో చేపలను విక్రయిస్తున్నారు. దీంతో పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో చేపల దుకాణాలను కొత్తపేట మార్కెట్ ప్రాంతంలో తరలించాలని నిర్ణయించారు. చేపల దుకాణాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన గదులు, ఆరుబయట ప్రాంతాలను మత్స్యకార సంఘ నేతలు, దుకాణదారులతో కలసి వైస్ ఛైర్మన్ మునస్వామి, కమీషనర్ రవిరెడ్డి పరిశీలించారు. త్వరలోనే ఇక్కడ చేపల మార్కెట్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**కుప్పంరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ (డాక్టర్) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్. కొత్తపల్లి పిహెచ్‌సి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డా॥ సుభాష్ రాజా కోరారు. బుధవారం గరిగచీ నేపల్లి గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ముత్తుకుమార్, సిబ్బంది గీత, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

## డ్రిప్ ఇరిగేషన్‌ను వేగంతం చేయండి : జిల్లా పిడి

**పలమనేరు,నవంబర్ 9 ప్రభాతవార్త:**




రైతు భరోసా కేంద్రం సిబ్బంది డ్రిప్ ఇరిగేషన్‌ను వేగవంతం చేయాలని జిల్లా పిడి మదుసుధ న్‌రెడ్డి సూచించారు. స్థానిక సిఎల్‌ఆర్‌సి భవనంలో బుధ వారం రైతుభరోసాకేంద్ర సిబ్బంది కి మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ రైతు భరోసా సిబ్బంది డ్రిప్ ఇరిగేషన్ పై రిజిస్ట్రేషన్‌లు ప్రథమ తనిఖీ,అంతిమ తనిఖీ వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎపిడి రమణ రెడ్డి,కార్యదర్శి ప్రసాదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతుల వివరాల నమోదు తప్పని సరి

**పలమనేరు,నవంబర్ 9 ప్రభాతవార్త:**



గర్భవతుల వివరాలు నమోదు తప్పని సరి చేపట్టాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి జయ శంకర్ తెలిపారు. మండలంలోని పెంగరగుంట గ్రామంలోని వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు సిబ్బందితో ఆయన మాట్లాడుతూ గర్భవతి వివరాలు 3 నెలలోపు నమోదు చేపట్టి టిటి మొదటి టీకాగా ఇవ్వాలని, ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో వారి పేరు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది కైరున్,అశ్విని,ఆశా తదిరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 18న కాణిపాకం పాలకమండలి సమావేశం

**కాణిపాకం, నవంబర్ 9 ప్రభాతవార్త**
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం పాలకమండలి సమావేశం ఈనెల 18న జరుగుతుందని ఆలయ ఈఓ ఎస్.రాణాప్రతాప్ తెలిపారు. ఈమేరకు స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు పాలకమండలి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశానికి ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## బొలోరో బోల్తా - ఒకరికి గాయాలు

**చౌడేపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త :**



చింతకాయ తరలిస్తున్న బొలోరో వాహనం బోల్తాపడి ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో పుంగనూరు వైపు నుంచి చౌడేపల్లికి చింతకాయను వేసుకొనేందుకు వస్తున్న ఓ బొలోరో వాహనం మార్గ మధ్యలోని పొదలపల్లి బస్‌స్టాప్ వద్ద టైరు పగిలింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపైనే బోల్తా పడింది. ఈప్రమాదంలో వాహన డ్రైవర్ మహబూబ్‌భాషా(32)కు గాయాలు కాగా, మరో వ్యక్తి కరీముల్లా(40)కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

**చౌడేపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త :**
వ్యవయసాయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని చిత్తూరు రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం కాటిపేరి ఆర్‌బికేలో వరి, వేరుశెనగ పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు, సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ, విఎఎ జయంతి, వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సన్నిధిలో చిత్తూరు నూతన డీఎస్పీ

**కాణిపాకం, నవంబర్ 9 ప్రభాతవార్త:**



చిత్తూరు నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తి బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలి కి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. డీఎస్పీవెంటచిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, స్థానిక ఎస్సై మనోహర్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 26న వాహనాల బహిరంగ వేలం

**పలమనేరు,నవంబర్ 9 ప్రభాతవార్త:**



పలమనేరు పరిధిలో గతంలో పలు కేసులలో పలు శాఖల అధికారులు స్వాధీనం చేసుకున్న 26న వాహనాలను డిటిసి బసిరెడ్డి,ఎంవిఐ మదుసూధన్ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు.స్థానిక ఆర్టీసి డిపో ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలంలో 4 లారీలు,10ద్విచక్ర వాహనాలు,3 లాగేజీ ఆటోలు,8ఆటోలకు వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.11,25,000లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంవిఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు కుప్పం -విజయవాడ బస్సు సర్వీసు ప్రారంభం

కుప్పం - విజయవాడ మార్గంలో నూతన బస్సు సర్వీసును గురువారం మధ్యాహ్నం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ప్రారంభిస్తారని ఆర్టీసీ డిపో మేనేజర్ టికె స్వామి తెలిపారు. గతంలో ఉన్న బస్సు వివిధ కారణాలతో రద్దయిన నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్సీ భరత్ ఆర్టీసీ అధికారులను బస్సు నడపాలని కోరిన నేపథ్యంలో నూతన లగ్జరీ బస్సును గురువారం నుంచి విజయవాడకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ భరత్‌చే 50వేల విరాళం

**కుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త :**
చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ తన ఉదార స్వభావాన్ని మరోమారు చాటుకున్నారు. గుడుపల్లె మండలం కనమనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో శ్రీరణ గంగమ్మ ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించు కున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణం కోసం గ్రామస్తులు



ఎమ్మెల్సీ భరత్‌ను సంప్రదించగా వెంటనే ఎమ్మెల్సీ భరత్ స్పందించి తనవంతు అమ్మవారి ఆలయ నిర్మాణంకు యాభై వేల రూపాయలను విరాళంగా అందించారు. అమ్మవారి ఆలయ నిర్మాణంలో తనవంతు భాగస్వామి కావడం పట్ల ఎమ్మెల్సీ భరత్ సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణంకు విరాళ ం అందించిన ఎమ్మెల్సీ భరత్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోలా వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా ఉంటాం

**వెంకటగిరిరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త:**



ఇటీవల ప్రమాదవశాస్తు మరణించిన వెంకటగిరి మండల జెడ్‌పిటిసి కోలా వెంకటేశ్వర్లు కుటుంబాని బుధ వారం మాజీ మంత్రి వెంకటగిరి ఎమ్మెల్యే అనం రామ నారయణరెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి మండలం లోని కె ఉప్పరపల్లి జెడ్‌టిసి స్వగ్రామం కు వెళ్ళి కోలా వెంకటూశ్వర్లు చిత్రం పటంకు నివాళి అర్పించి వారి కుటుంబాని పరమర్శించారు. వారి వెంట వెంకటగిరి మండలఎంపిపితంబిరెడ్డితనూజరెడ్డి,వెసిపి నాయు కులు తదితరులు ఉన్నారు.

## పియం కిసాన్ కోసం ఈకెవైసి నమోదు తప్పని సరి

**వెంకటగిరిరూరల్,నవంబర్ 9 ప్రభాతవార్త:**



గ్రామీణ ప్రాంతాలల్లోని ఆర్హులైన ప్రతి రైతు పియం కిసాన్ నగదు లబ్ది కోరకు తప్పని సరిగి ఈకెవైసి నమోదు చేసుకోవాలని వెంకటగిరి వ్యవసాయ సహయ సంచాలకులు నాగర్జున్ సాగర్ అన్నారు. బుధవారం వెంకటగిరి వ్యవసాయ శాఖ కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లడుతూ డాక్టర్ వైఎస్‌ఆర్ పోలం బడి ప్రముఖ్యత పై అదే విధంగా సన్న చిన్నకారు రైతులకు వ్యవసాయ శాఖ అందిస్తు తన్న రాయతీలపై పథకాల పై మరియు రైతు భరోసా కేంద్రాల ప్రముఖ్యత పై సూచనలు సలహలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటగిరి వ్యవసాయశాఖ అధికారిణి సుజాత,వి.ఎ.ఎలుశివ బాస్కర్, దివ్య, సుమ, సుమతి, వరలక్ష్మి, ఎఈఏ తదితరులు పోల్గన్నారు.

## గురుకులంను సందర్శించిన డిసిఓ

**వాకాడు, నవంబర్ 9 ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన వాకాడులో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులమును బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల జిల్లా గురుకుల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ వి. జయ భారతి ఆకస్మికంగా సందర్శించారు. గురుకులంతో పాటు వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు. గురుకులంలో విద్యార్థులకు మెరుగైన విద్యను అభ్యసించాలని ఆమె ఉపాధ్యాయులకు తెలియజేసింది. వచ్చే ఏడాది ఎంతో ఇంటర్‌లలో విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం రాకపోతే, ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ రామానుజచార్యులు, గురుకుల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో ప్రజారంజక పాలన : ఎమ్మెల్యే

**కోట, నవంబర్ 9 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందుతోం దని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం కోట మండలం కర్లపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ గత మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఏమమ్మా మీ కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష నుంచి రెండున్నర లక్షల వరకు అందజేశారని చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో మారెళ్ల భవాని, మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సిద్ధవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, సర్పంచ్ రాజ్యలక్ష్మి, గూడూరు డివిజన్ యువనాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్లు ఇలా... ప్రయాణం ఎలా

- దెబ్బతిన్న రహదారులతో ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

**ఓజిలి, నవంబర్ 9 ప్రభాతవార్త :**
అడుగడుగునా గుంతలు, రాటుతేలిక కంకరపై ప్రయాణం వాహనదారులకు నరకాన్ని తలపిస్తోంది. ఈ రహదారులపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే గమ్యస్థానం వచ్చేవరకు వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఓజిలి మండలం బత్తలాపురం, చిల్లమానుచేను, పెద్దపరియ, తదితర గ్రామాల్లో ఛిద్రమైన రహదారుల గుండా వెళ్లాలంటే నరకాన్ని తలపిస్తోంది. రోడ్లు అధ్వానంగా




మారడంతో వాహనాలు మరమ్మతులకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈమార్గాలలోగుంతలు,కంకరలేచిపోయి దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క రహదారిలోగుంతలుఆరేడుచోట్లదర్శనమిస్తున్నాయి. అప్పుడు ఇప్పుడు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గాల్లో వెళ్లాలంటే భయంగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ అదుపుతప్పితే ప్రమాదాలే ఈ మార్గాలలో రాత్రి వేళలో ప్రయాణం చేయాలంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రోడ్డు వైపు వెళ్లాలంటే పరిస్థితి మరింతదారుణంగాఉందని వాహనదారులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులుస్పందించి రోడ్లు బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

**కోట, నవంబర్ 9 ప్రభాతవార్త :**
కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం మండల పరిధిలోని గర్భిణులకు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ డి.రాజా, గైనకాలజిస్ట్ డాక్టర్ రూపా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. నెలలు పెరిగేకొద్దీ ఆసుపత్రిలో చూపించుకుంటూ వైద్య సేవలు పొందాలన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి గుర్తుతెలియని మృతి!

**సూళ్లూరుపేట, నవంబర్ 9 ప్రభాతవార్త :**
సూళ్లూరుపేటలోని రైల్వేస్టేషన్‌లు రైలుపట్టాలు దాటుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వేస్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫారం నుంచి మూడవ నవంబర్ ప్లాట్‌ఫారం మీద ఉన్న లోకల్ రైలులో వెళ్లడానికి రైలు పట్టాలు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పుదుచ్చేరి నుంచి న్యూఢిల్లీకి వెళుతున్న ఈ రైలు ఢీకొంది. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్న ఈ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ జి.మాలకొండయ్య తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి : తహశీల్దార్

**నాయుడుపేట, నవంబర్ 9 ప్రభాతవార్త :**



18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్ర అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలో ఓటు హక్కు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతి విద్యార్థికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు

## సమగ్ర విచారణకు పొదుపు సంఘాలు వినతి

**సత్యవేడు, నవంబర్ 9 ప్రభాతవార్త :**
మండలంలోని మల్లవారిపాలెం వెస్ట్, ఇరుగుళం పరిధిలో ఉన్న పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలు రుణాల మంజూరు, చెల్లింపులు, శ్రీనిధి, గ్రామసంఘాల రుణాలు వంటి విషయాలపై సమగ్ర విచారణ చేయాలంటూ అక్కడ వాసులు కోరుతున్నారు. కొందరు సంఘమిత్రల చేతివాటం మూలంగా నిధులు పక్కదారి పట్టాయని, పలుచోట్ల లక్షల్లో నిధులు స్వాహా అయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. మల్లవారిపాలెం వెస్ట్‌లో శ్రీనిధి, సిఐఎఫ్ రుణాలకు సంబంధించి సొమ్ము పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటి విషయంపై సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంకు, వెలుగు పీడీకి మల్లవారిపాలెం వెస్ట్ పొదుపు సంఘాలవారు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వారు ఆరోపిస్తున్నారు. మండల వెలుగు ఏపియంకు అన్నీ తెలిసిన విచారణ చేసే విషయంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## టిడిపి బిసి,మహిళా కార్యవర్గాల ఏర్పాటు

**పలమనేరు,నవంబర్ 9 ప్రభాతవార్త:**
పలమనేరు నియోజకవర్గ టిడిపి బిసి,మహిళా కార్యవర్గాన్ని మాజీ మంత్రి అమరనాథరెడ్డి బుధవారం ప్రకటించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ అంకిత భావంతో పని చేస్తున్న వారిని గుర్తించి వారిని కార్యవర్గంలో ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.ఈ మేరకు పలమనేరు నియోజకవర్గ బిసి కార్యవర్గంలో అధ్యక్షులుగా నాగభూషణం,ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు,రెడ్డెప్ప,ఆనంద గౌండర్,ప్రధాన కార్యదర్శిగా స్వతంత్రబాబు,అధికార ప్రతినిధులుగా రామచంద్ర, మంజునాథ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా భాస్కర్, గోపాల్, రెడ్డెప్ప, శివ, చెన్నరాయప్ప, కార్యదర్శులుగా సుబ్రమణ్యం,చలపతి, నక్షత్రయ్య, బాలసుబ్రమణ్యం, మని, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా నాగరాజును ఎంపిక చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ మహిళా కార్యవర్గంలో అధ్యక్షులుగా శివకుమారి,ఉపాధ్యక్షులుగా వేణమ్మ, వనజమ్మ,జయమ్మ,ప్రధాన కార్యదర్శిగా జయశీల,అధికార ప్రతినిధులుగా బేబమ్మ, జ్యోతి,కార్యనిర్వాహక కార్యదర్శులుగా పర్వీన్, ద్రాక్షయని, అమరావతి,మంజుల, రెడ్డెమ్మ, లీలావతి,కార్యదర్శులుగా సరసమ్మ, సరిత, ఈశ్వరమ్మ,వెంకటరత్నమ్మ,రెడ్డెమ్మలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

## పూడి మార్గంలో రాకపోకలు పునరుద్ధరణ

**వడమాలపేట, నవంబరు 9 ప్రభాతవార్త:**
పూడి మార్గంలో రాకపోకలను బుధవారం మధ్యాహ్నం నుంచి పునరుద్ధరించారు. పూడి రైల్వే గేటు వద్ద మరమ్మతుల కారణంగా సోమవారం సాయంత్రం నుంచి గేటు మూసి వేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పనులు పూర్తి కావడంతో బుధవారం మధ్యాహ్నం నుంచే రైల్వేగేటు తెరిచి రాకపోకలను అనుమతించినట్లు అధికారులు తెలిపారు.

## శ్రావణ్‌కుమార్ వల్ల క్రైస్తవ సమాజానికి ఒరిగేదేమీ లేదు

-క్రిస్టియన్ జేఏసి చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 9 ప్రభాతవార్త:**



క్రైస్తవ జనోదరధరణ పేరుతో రాజకీయాలు చేస్తున్న జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ జడ్జి జడ శ్రావణ్‌కుమార్ వల్ల క్రిస్టియన్ కమ్యూనిటీకి మేలు జరగడం బదులు నష్టమే జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ జేఏసి చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.జై భీమ్ భారత్ పార్టీ పేరుతో ముందుకు వచ్చి క్రైస్తవులకు ఏదో మేలు చేస్తానని మభ్యపెట్టడం హాస్యాస్ప దంగా ఉందన్నారు.ఇప్పటికే దళిత బహుజనుల ఉద్ధరణకు ఉద్భవించినబిఎస్పీ,ప్రజాశాంతి పార్టీ లాంటివే కష్టపడుతున్న తరుణంలో ఇటువంటిపార్టీలుదళితులకుఎలామేలుచేస్తాయో ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో ఎప్పటి నుండో క్రైస్తవుల సమస్యలు పరిష్కరించడానికి అనేక క్రైస్తవ సంఘాల నాయకులు ఉండగా నీ అవసరం మాకు అక్కరలేదని తేల్చి చెప్పారు.

## విజయపురం ఎంపిడిఓగా ఇందిర

**విజయపురం, నవంబరు 9 ప్రభాతవార్త :**



విజయపురం ఎప్‌ఎసి ఎంపిడిఓగా ఇందిర బుధవారం బాధ్యతలు చేపటారు. విజయపురంలో విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఓ దీర్ఘ కాలిక సెలవుపై వెళ్లడంతో పుత్తూరు ఎంపిడిఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపిడిఓను ఎంపిపి జమున, వైస్ ఎంపిపి దశరథ, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు.

# తిరుపతి డివిజన్

## ధ్యాన విద్యార్థి వారోత్సవాలు

పుత్తూరురూరల్, నవంబరు 9 ప్రభాతవార్త: ధ్యాన విద్యార్థి వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక ఎస్ఆర్ఎస్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు శ్వాస విజ్ఞానజ్యోతి పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డి.నాగరాజు పాల్గొని మాట్లాడుతూ ఒకానొక చిన్ని విత్తనంలో మన కంటికి కనిపించని ఒకానొక మహా వృక్షం దాగి ఉన్నట్లు విత్తన రూపంలో ఉన్న ప్రతి ఒక్క విద్యార్థిలో కూడా అనంతమైన శక్తి సామర్థ్యాలు దాగి ఉంటున్నాయి. వాటిని మేల్కొలిపే మార్గం ధ్యానం ఆత్మ విజ్ఞాన శాస్త్రం ఆత్మన్యూనత, సరైన మానసిక పరి పక్వత లేని కారనంగా ఈనాడు అనేక మంది విద్యార్థులు, యువకులు ఆత్మ హత్యలకు పాల్పడి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను శోకసముద్రంలో ముంచుతున్నారు. అటువంటి వారి మనోధైర్యాన్ని పెంచే ఈ ధ్యాన సాధన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులకు శ్వాస విజ్ఞాన జ్యోతి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్.జయచంద్రన్, కె.వెంకటేశ్వరులు, ఎస్. అపరంజి, జె.సునిత, పద్మనాభం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఆత్మ విశ్వాసం అవసరం

వడమాలపేట, నవంబరు 9 ప్రభాతవార్త:



విద్యార్థులకు ఆత్మ విశ్వాసం ఉంటేనే ఉన్నతంగా అభివృద్ధి సాధించ కలుగుతారని ధ్యాన వైద్య ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. అనంతరం శ్వాస విఘ్నాణ జ్యోతి పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పీడీ చంద్రశేఖర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి ఎంఎల్ఏ చేయూత

తొట్టంబేడు, నవంబర్ 9 ప్రభాతవార్త :



మండలంలోని గుర్రప్పనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన ముత్యాలయ్య, అలాగే పిల్లమేడుకు చెందిన గురవయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించడానికి తన తనయుడు ఆకర్ష్‌రెడ్డిని పంపి వారి కుటుంబాలకు చేయూతనందించడంతోపాటు దహన సంస్కారాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెవిపియస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త :



ఈ నెల 12న జరగబోయే కెవిపియస్ జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పుచ్చల పల్లి సుందరయ్య భవనం వేదికగా జిల్లా కెవిపియస్ మహాసభల నిర్వహణకు తీర్మానించినట్లు డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ వివరించారు.కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కెవిపియస్ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షుడుగా వ్యాసారపు హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిపల్లి సురేష్, ఉపాధ్యక్షుడిగా సురేష్, కోశాధికారిగా ఈశ్వరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ సూపర్‌వైజర్లకు 5 రోజుల శిక్షణ ప్రారంభం

తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 9 ప్రభాతవార్త:




స్థానిక తిరుచానూరు రోడ్డులోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణం నందు తిరుపతి,చిత్తూరు జిల్లాలలో కొత్తగా నియమించబడిన తాత్కాలిక ఇన్‌ఛార్జ్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్లకు 5 రోజుల పాటు ఇండక్షన్(ప్రేరణ) శిక్షణ తరగతులు ప్రాజెక్ట్ డైరెక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం గురించి ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఫీల్డ్‌లో ఎవరెవరిని కలవాలి,ఏ విధంగా వారిని సమన్వయం చేసుకోవాలో, అలాగే వారి లక్ష్యాలను ఏ విధంగా అధికమించాలి అన్న విషయాలపై సూపర్‌వైజర్లకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం) జిల్లా మేనేజర్ ఎ.వాసంతి,సిడిపిఓలు ప్రదీప్,ఫర్జీన్,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన సర్వేర్ల సంఘం నాయకులు

తిరుపతిరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా సంఘం సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లాలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. క్షేత్రస్థాలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను దుశ్శాలవతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి. కరుణకుమార్, కార్యధర్శి చరణ్, సభ్యులు హరినాథ్, పురుషోత్తం, విజయకుమార్, జ్యోతిగన్ తదితరులు ఉన్నారు.

## కార్తీక మాసం సుదర్శనం, సత్వర దర్శనం

శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భక్తుల తాకిడి ఓ మోస్తరుగా ఉంది. మంగళవారం చంద్రగ్రహణంతో కిట కిటలాడిన ఆలయం బుధవారం భక్తులు లేక వెల వెలబోయింది. వచ్చిన భక్తులు సుదర్శనం, సత్వర దర్శనం చేసుకున్నారు. భోళాశంకరుని దర్శించుకున్న భక్తులు ఎంతో సంతోష పడ్డారు. సంబరపడ్డారు.చలి వణికిస్తున్నా భక్తులు లేక్క చేయక హాజరయ్యారు.సాధారణంగా బుధవారం అంతంత మాత్రంగా ఉండే రద్దీ 10వేల మంది దర్శించుకున్నారు.భక్త జనం తక్కువగా ఉండటంతో వచ్చిన భక్తులకు సుదర్శనం, సత్వర దర్శన భాగ్యం లభించింది. ప్రతి రోజూ కనీసం 20వేల మంది భక్తులు వస్తున్నారు. అయితే తిరుమలేశుని దర్శనాలకు భక్తుల సంఖ్య తగ్గటంతో ఇక్కడ కూడా తగ్గింది.

## రేపు యువతీ యువకులకు మెగా జాబ్ మేళా!

తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 9 ప్రభాతవార్త:

రేపటి రోజు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు పదవ తరగతి పాస్/ఫెయిల్ నుండి పిజి వరకు ఉత్తీర్ణత అయిన యువతీ యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా అధికారి ఎన్.శ్యామ్‌మోహన్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 14 జాతీయ కంపెనీలలో దాదాపు వెయ్యి ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.ఈ జాబ్ మేళాలో అర్హత సాధించిన వారికి నెలకు కనీస వేతనం 10 వేల నుండి 30 వేల రూ॥ల వరకు వివిధ కంపెనీలలో ఉద్యోగ నియామకాలు కల్పించబడుతుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు జిరాక్స్,5 బయోడేటా ఫామ్‌లు,అన్ని సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలన్నారు.మరిన్ని వివరాల కోసం 8121585857/9966601867 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య

తిరుపతిరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త:



విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా తప్పనిసరి అని కుంట్రపాకం గ్రామ సర్పంచ్ రాచపాళ్యం శుభపద్మనాభరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కుంట్రపాకం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్‌లు, చాక్లేట్స్ తదితర విద్యాసామాగ్రిని సర్పంచ్ అందజేసారు. చిన్నతనం నుండి విద్యతో పాటు, ఆట, పాట, క్రమశిక్షణ అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యధర్శి నంద్యాల మురళి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కార్తీక శోభ... ఆకాశ దీపం

శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త



కార్తీకమాసం దీపాల కాంతితో ఆలయం దేదీ ప్యమా నంగా వెలిగిపో తుంది. ఈ నేపథ్యం లో బుధవారం ఆకాశ దీపాన్ని ఆలయ ఎసి మల్లికార్జున ప్రసాద్, సూపరింటెండెంట్ శ్రీహరి ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగాశాస్త్రోక్తంగాఆకాశదీపాన్నిఆవిష్కరింపజేసారు.వేదపండితులవేద మంత్రాలతో ఆవిష్కరించారు. ఆలయ డెప్యూటీ ఎపిఆర్ఓ శ్రీనాథ్ వేదపండితులు,అర్చకులు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## అభిమాన నాయకుడికి వేద పండితుల ఆశీస్సులు



చంద్రగిరి, నవంబర్ 9 ప్రభాతవార్త: తమ అభిమాన నాయకుడు ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బోడిరెడ్డి అచ్యుత విజయ్‌కుమార్ రెడ్డి వేదపండితుల ఆశీస్సులతో ఆతిధ్యం ఇచ్చారు. ఇందులో భాగంగా బుధవారం చెవిరెడ్డి నివాసంలో దంపతులు ఇరువురిని ఘనంగా సన్మానించి, వేదపండితుల ఆశీస్సులతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తమపట్ల కనబరిచిన అభిమానానికి చెవిరెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆదర్శనీయుడు ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి :**

ఆదర్శనీయుడు మన ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని వైసిపి మండల కన్వీనర్ యద్దల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.రామచంద్రాపురంలో కన్వీనర్ బాబు యాదవ్, కుప్పబాదూరులో కన్వీనర్ చిట్టిబాబు, నెన్నూరులో కన్వీనర్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

## రైతు బజారులో కార్తీక దీపోత్సవం




తిరుపతిరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రాయలచెరువు రోడ్డులో ఉన్న రైతు బజారులో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టేట్ ఆఫీసర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు వెయ్యి దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. రైతు బజారు వెయ్యి దీపాల కాంతిలో వెలుగుశోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చిన జనసేన నేతలు

తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 9 ప్రభాతవార్త:



స్థానిక 47వ వార్డులోని ఎర్రమిట్టలో పంచాయితీ బోరు రిపేరు కారణంగా గత వారం రోజులుగా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం నాడు అక్కడి ప్రజలు జనసేన నాయకుల దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా ప్రజలు నీటికి ఇబ్బందులు పడకూడదనే సదుద్దేశ్యంతో 6 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి,రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన,నవ్య,లక్ష్మి,జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.

## టిడిపి పర్యటనకు హాజరుకండి

విజయపురం, నవంబరు 9 ప్రభాతవార్త : మండలంలో గురువారం ఉదయం పది గంటలకు జరిగే తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ పర్యటనకు నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు బుధవారం విజ్ఞప్తి చేశారు. మీ కోసం – మీ తెలుగుదేశం కార్యక్రమంలో మండలంలోని కాళికాపురం, కెవిపురం పంచాయతీల్లో పర్యటన జరుగుతుందని తెలిపారు.

## నవరత్నాలతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, నవంబర్ 9 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు ద్వారా అభివృద్ధి జరుగుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను పెరుమాళ్ళపల్లిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం నవరత్నాలను అమలు చేస్తోందన్నారు. ఈ నవరత్నాలతో అన్ని కుటుంబాలు అభివృద్ధి పథం వైపు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, వైకాపా నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, జగదీష్, రఘుపతిరాజు, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మరింత ఆహ్లాదకరం

తిరుపతి,నవంబర్ 9ప్రభాతవార్త



తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు మరింత ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని జెఇఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా ఛండీయాగంలో జెఇఓ దంపతులు పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

## వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా సాయిరెడ్డి

బంగారుపాళ్యం, నవంబర్ 9 ప్రభాతవార్త:



పూతలపట్టు నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి యూత్ అధ్యక్షుడిగా దేవి ప్రసాద్ సాయిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఓ ప్రకటనలో ప్రకటించారు. సాయిరెడ్డి తవణంపల్లి మండలం మత్యం గ్రామానికి చెందిన వ్యక్తి. నియోజకవర్గ పరిధిలో వైఎస్ఆర్‌సిపి పార్టీ బలోపేతంకు యువతకు అండగా నిలుస్తానని నూతనంగా ఎంపికైన సాయిరెడ్డి పేర్కొన్నారు. తనకు ఈ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నియోజకవర్గ మండల పార్టీ కన్వీనర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బంగారుపాళ్యం మండల వైకాపా యూత్ అధ్యక్షుడిగా జగదీష్ నియమితులయ్యారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంటాక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, జివో నంబర్ 549 ప్రకారం నెలకు రూ.16వేలు వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు వసతిగదిని ఏర్పాటుచేయాలన్నారు. ఈసమస్యలన్నింటినీ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, గోపి, రవి, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## తొరూరులో గడప గడపకు మన ప్రభుత్వం

పుత్తూరురూరల్, నవంబరు 9 ప్రభాతవార్త:



తొరూరులో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురసచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొరూరు గ్రామంలో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసా ద్‌రెడ్డి బుధవారం వార్డ్‌వాక్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయనఇంటింటికి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అప్పటికప్పుడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, కో–ఆప్షన్ మెంబరు రాంబత్తయ్య, సర్పంచ్‌లు సరళ, గోవిందస్వామిరెడ్డి, మురళి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాలో దుష్టశక్తుల ఆటలు సాగనీవ్వం: సురేంద్రరెడ్డి

పెనుమూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:

మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో విబేధాలు సృష్టించడానికి తమ మహాసముద్రం కుటుంబాన్ని అభాసుపాలు చేయడానికి కొంతమంది దుష్టశక్తులు, స్వార్ధపరులు విబేధాలు సృష్టిస్తున్నారని వారి ఆటలు సాగనీయ్యమని వారి ఆటలు సాగనీయ్యమని మండల వైకాపా కన్వీనర్ మహాసముద్రం సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జరిగిన మండల వైకాపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా వుండాలని మహాసముద్రం కుటుంబం పార్టీకి అండగా వుండి సేవలు చేస్తుంటే కొన్ని దుష్టశక్తులు విబేధాలు సృష్టిస్తున్నారని వారికి గుణపాఠం చెప్తామన్నారు. జడ్పీటీసీ దొరస్వామి, ఎంపిటీసీ మహాసముద్రం హేమలతారెడ్డి ప్రతి నెలా రెండు సోమవారాలు కార్యాలయంలో వుండి ప్రజల సమస్యలపై దృష్టి పెడ్తారన్నారు. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపిపి కోదండన్, ఎంపిటీసీలు సుబ్రమణ్యంరెడ్డి, సుభాషిణీ, వైకాపా నాయకులు గోవిందరెడ్డి, చక్రవర్తినాయుడు, యతీశ్వర్‌నాయుడు,

## అర్బన్ సిఐ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి అర్బన్‌సిఐ అంజూయాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.శ్రీకాళహస్తి సిఐగా బాధ్యతలు చేపట్టిన ఆమె అనతి కాలంలోనే పలు సంస్కరణలు చేపట్టారు.బుధవారం ఆమె జన్మదిన వేడుకలను సిబ్బంది ఏర్పాటు చేసారు. కేక్ కట్ చేసి తమ సంబరాలను జరిపారు. ఉదయం ఆమె శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు.కాగా పట్టణానికి చెందిన పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## బలహీన వర్గాలకు చేరువగా న్యాయవ్యవస్థ : సీనియర్ సివిల్‌జడ్జి

శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త :

బడుగు, బలహీన వర్గాలకు చేరువగా న్యాయవ్యవస్థ అందుబాటులో ఉందని సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి అన్నారు. మంగళవారం సుప్రీంకోర్టు, హైకోర్టు మరియు జిల్లా కోర్టు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని న్యాయస్థాన సముదాయంలో జాతీయ న్యాయసేవా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమావేశానికి సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్రులు, ఆర్డీవో కెఎస్.రామరావు, ఎపిపి జయశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడుపూరు ప్రసాద్, న్యాయవాది




ఉదయనాథ్, డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్‌లు విచ్చేశారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి మాట్లాడుతూ లీగర్ సర్వీసును పేద ప్రజలకు బలహీన వర్గాలకు చేరువగా, మహిళలకు మరియు చిన్నపిల్లలకు ఉచితంగా న్యాయసేవలను అందించడానికి 1987 లీగల్ సెల్ సర్వీస్ చట్టాన్ని 1995, నంబర్ 9వ తేదీ నుంచి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల ఉన్నతాధికారులు, లీగల్ ఎయిడ్‌కౌన్సిల్ సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పారాలీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

